# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-07-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ మెగా పేరెంట్స్-టీచర్స్ కార్యక్రమం ద్వారా విద్యావ్యవస్థలో నూతన సంస్కరణలు తీసుకువస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

- ❖ దేశంలో పోస్టల్ శాఖను ఐ.టి. 2.0 సాంకేతికతతో ఆధునీకరించామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

- ❖ రాష్ట్రంలో రవాణా రంగాన్ని పర్యావరణహిత ప్రజా రవాణా వ్యవస్థగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు.

- ❖ పార్వతీపురం మన్యం జిల్లాలో పంటలను కాపాడేందుకు కుంకీ ఏనుగులు తరలించామని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ చెప్పారు.

===================

భవిష్యత్‌లో పిల్లలే ఆస్తి అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పోలవరం జిల్లా రంపచోడవరంలో ఈరోజు నిర్వహించిన `మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్` కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సంతతి భారం కాదు, సంపద అనేలా `తల్లికి వందనం` పథకాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నామని చెప్పారు. పిల్లలు పుట్టినప్పటి నుంచి ఉన్నత విద్య అభ్యసించేవరకూ ప్రభుత్వమే అండగా నిలిచేలా వివిధ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 67 లక్షల మంది పిల్లలకు 10 వేల 120 కోట్ల రూపాయలు జమ చేసినట్టు వివరించారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమంతో విద్యావ్యవస్థలో నూతన సంస్కరణలు వస్తాయని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఈ కార్యక్రమంలో విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. ఆ దిశగా ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నామన్నారు. తల్లికి వందనం లక్ష్యం కేవలం ఆర్థిక సహాయమే కాదని.. తల్లిని, గురువును గౌరవించాలనే సదుద్దేశం ఇందులో దాగి ఉందని లోకేశ్ తెలియచేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

===================

దేశంలో పోస్టల్ శాఖను 5 వేల 500 కోట్ల రూపాయల వ్యయంతో ఐ.టి.2.0 సాంకేతికతతో ఆధునీకరించామని కేంద్ర కమ్యూనికేషన్, గ్రామీణాభివృద్ధి శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులో ఆధునిక మౌలిక సదుపాయాలతో రూపొందించిన కొత్తపేట, చంద్రమౌళీనగర్ సబ్ పోస్టాఫీసులను కేంద్రమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా 3 వేల పోస్టాఫీసులను ఇదే తరహాలో ఆధునికీకరించనున్నామని తెలిపారు.. 150 సంవత్సరాల పురాతనమైన పోస్టల్ వ్యవస్థను గడచిన రెండేళ్లలో సమూలంగా మార్చామని తెలిపారు. అలాగే సిబ్బంది ఆలోచనా సరళిని కూడా మారుస్తూ.. వినియోగదారులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. పోస్టల్ సేవల విషయంలో ఆంధ్రప్రదేశ్.. దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్న విషయాన్ని కేంద్రమంత్రి గుర్తు చేశారు.

===================

పార్వతీపురం మన్యం జిల్లాలో అడవి ఏనుగులను నియంత్రించేందుకు శిక్షణ పొందిన కుంకీ ఏనుగులు జయంత్, అభిమన్యులను చిత్తూరు జిల్లాలోని పలమనేరు ముసలమడుగు ఏనుగుల శిబిరం నుంచి ఈ రోజు తరలించారు. ఈ సందర్భంగా మంగళగిరి క్యాంపు కార్యాలయం వద్ద కుంకీ ఏనుగులకు ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కె. పవన్ కళ్యాణ్ స్వాగతం పలికారు. వీటిని పార్వతీపురం మన్యం జిల్లాలోని గుచ్చిమి ఏనుగుల శిబిరానికి తరలిస్తున్నారు. జిల్లాలోని పరిసర ప్రాంతాలలో అడవి ఏనుగుల బారి నుంచి పంటలను కాపాడేందుకు కుంకీ ఏనుగులు ఎంతో ఉపయోగపడనున్నాయని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ చెప్పారు. ప్రజల భద్రత, రైతుల పంటల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణ లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయ, మానవీయ విధానాలతో చేపడుతున్న చర్యల్లో భాగంగా కుంకీలను తరలిస్తున్నామని అన్నారు.

విరామం

===================

మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా రేపల్లె మండలం పేటేరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఉపాధి కల్పన పథకాల ద్వారా రుణాలు పొందుతూ.. చిన్నతరహా పరిశ్రమలు, స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించి తమ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నారని తెలిపారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (PMEGP) వంటి పథకాలను మహిళలు మరింతగా వినియోగించుకోవాలని మంత్రి సూచించారు.

===================

రాష్ట్రంలో రవాణా రంగాన్ని ఆధునికీకరించి.. పర్యావరణహిత ప్రజా రవాణా వ్యవస్థగా తీర్చిదిద్దుతున్నామని రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. విశాఖ స్టీల్ సిటీ డిపోలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఈ-బస్సు సేవలను ఆయన ఈరోజు ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా విద్యుత్ బస్సులను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. భోగాపురం అంతర్జాతీయ

విమానాశ్రయానికి ప్రత్యేకంగా 20 ఈ-బస్సులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రయాణికులకు సౌకర్యవంతమైన, వేగవంతమైన సేవలు అందిస్తున్నామని రాంప్రసాద్ రెడ్డి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

===================

ఎల్‌నినో ప్రభావంతో కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వర్షాలు తగ్గడంతో కృష్ణా నదిలో నీటి ప్రవాహాలు గణనీయంగా తగ్గాయని రాష్ట్ర నీటి పారుదల శాఖ ఇంజినీర్-ఇన్-చీఫ్ కె. నరసింహమూర్తి తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, కృష్ణా నదిలో ప్రస్తుత నీటి లభ్యత, కృష్ణా డెల్టాకు సాగు, తాగు నీటి సరఫరాపై ఆ శాఖ అధికారులతో కలిసి విజయవాడలోని ఇరిగేషన్ కాంపౌండ్ లో ఆయన ఈరోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్రంలో సాధారణం కంటే 51 శాతం, కృష్ణా డెల్టా పరిధిలో 49 శాతం వర్షపాతం లోటు నమోదైందన్నారు. ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల ప్రాజెక్టుల్లో సుమారు 50 టీఎంసీలు, తుంగభద్రలో మరో 70 టీఎంసీల కుషన్ ఉండటంతో అవి నిండితేనే శ్రీశైలానికి నీరు వచ్చే పరిస్థితి ఉందన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో కూడా కుషన్ నింపిన తర్వాతే దిగువ ప్రాంతాలకు నీటి విడుదల సాధ్యమవుతుందని చెప్పారు. ప్రస్తుతం పట్టిసీమ ద్వారా ఆర్ఎంసీ కాల్వకు నీటిని విడుదల చేస్తున్నప్పటికీ... గోదావరి నదిలో ప్రవాహాలు కూడా గణనీయంగా తగ్గాయని తెలిపారు. అందువల్ల కృష్ణా డెల్టాకు విడుదల చేస్తున్న నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

===================

రాష్ట్రంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా జిల్లాల్లో ఈరోజు, రేపు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారిణి జి. లక్ష్మి పేర్కొన్నారు.

===================

గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే 1972 టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని ఎన్టీఆర్ జిల్లా ఈగల్ ఎస్పీ స్వరూప రాణి ప్రజలకు సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఆమె భరోసా ఇచ్చారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని పల్లెబాటలో భాగంగా ఈ రోజు నిర్వహించిన ఈగల్–రచ్చబండ కార్యక్రమంలో ఆమె ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు.

===================
===================